పీఎంవీవైని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 19: చేతి, కుల వృత్తుల వారికి ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ స్కీంపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 18 సంప్రదాయ వృత్తులకు చెందిన వృత్తి, హస్తకళాకారులు, విశ్వకర్మ, ధోబీ, నాయీబ్రాహ్మణ, కుమ్మరి, శిల్పులు, స్వర్ణకారులు, వడ్డెర, మేర, మేదరి, ఉప్పరి, మోచి, తదితర చేతి వృత్తుల వారు, కళాకారులకు పరికరాల కోసం ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్, ఐడీకార్డుతో పాటు పారిశ్రామిక పనిముట్ల కొనుగోలు కోసం రూ.15వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. అయిదు శాతం వడ్డీకే రూ.3 లక్షల ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కింద రెండు విడుతలుగా రుణం ఇవ్వనున్నామని వెల్లడించారు. డిజిటల్ లావాదేవీలపై ప్రతి నెలా రూ.100 చొప్పున ఇన్‌సెంట్ లభిస్తుందన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన వారు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆధార్, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, మొబైల్‌నెంబర్, బ్యాంకు వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎల్‌డీఎం ఆంజనేయులు, ఎన్‌వైసీ అధికారి వెంకట రాంబాబు తహసీల్దార్లు పాల్గొన్నారు.

రక్తదాతలే నిజమైన హీరోలు

రక్తదానం చేస్తున్న అధ్యాపకుడు

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 19: రక్తదాతలే నిజమైన హీరోలని కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో తెలంగాణ 9వ బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాటి మనిషి ప్రాణాన్ని కాపాడే రక్తదానం, అన్ని దానాల కన్నా గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులకు రక్తదానం వల్ల కలిగే లాభాలను వివరించారు. తెలంగాణ 9వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ డానియల్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ కెడెట్లు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఇతరులకు సహాయం చేయడంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు శ్రీలత, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, కిట్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

వీణవంకలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత పరిపాటి జన్మదిన కేక్ కట్ చేస్తున్న నాయకులు

కేకులు కోసి.. పండ్లు పంచి..

వీణవంక, డిసెంబర్ 19: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు పరిపాటి రవీందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు, పోతిరెడ్డిపల్లి, ఇల్లందకుంట ఓల్డేజ్ హోంలో కేక్‌లు కట్ చేశారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పరిపాటి రవీందర్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మ్యాడగోని భరత్, నాయకులు చెవుల ఐలయ్య, తాళ్లపెల్లి శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, రమేశ్, అఖిల్, అప్పని హరీశ్‌వర్మ, యారా కుమార్, వొల్లాల శ్రీకాంత్, అంబాల శ్రావణ్, మిడిదొడ్డి అనిల్, మిడిదొడ్డి సాయిరామ్, తాళ్లపెల్లి రాకేశ్, రాపర్తి నితిన్, యారా అజయ్, జతిన్ వర్మ, మహేందర్, సునీల్, అక్షయ్, అభిలాష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్లలో కొత్త సాఫ్ట్‌వేర్

- 1-10 ప్రొఫార్మాస్ ఆన్‌లైన్‌లో ప్రతీది నిక్షిప్తం చేస్తున్నం
- జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మార్కెట్లలో డాటా ఎంట్రీ చేసినం
- ఎంట్రీ చేసిన డాటాను పరిశీలిస్తున్నం
- డీఎంవో పద్మావతి.. జమ్మికుంట మార్కెట్లో డాటా పరిశీలన

ఆన్‌లైన్ మార్కెట్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను పరిశీలిస్తున్న డీఎంవో పద్మావతి, మార్కెట్ కార్యదర్శి రెడ్డినాయక్

జమ్మికుంట, డిసెంబర్ 19: వ్యవసాయ మార్కెట్లలో పారదర్శకత కోసం ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకువచ్చిందని, 1-10 ప్రొఫార్మాస్ పేరిట ఆన్‌లైన్‌లో ప్రతీది నిక్షిప్తం చేస్తున్నామని జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి, అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. రికార్డులు పరిశీలించారు. తర్వాత 1-10 ప్రొఫార్మాస్ ఆన్‌లైన్‌కు సంబంధించిన డాటా ఎంట్రీని తానే స్వయంగా ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయేంత వరకు వెరిఫికేషన్ చేశారు. మార్కెటింగ్ శాఖ ఆర్థిక సంవత్సరం 2021-22 నుంచి ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలు, క్రయ, విక్రయాలు, ఆస్తులు, ఖర్చులు, ఫీజులు, రైతు బంధు, ఈ సర్వీసులు, అభివృద్ధి పనులు, తదితర అంశాలన్నీ మ్యానువల్ రికార్డుల ప్రకారం ఆన్‌లైన్‌లో పొందుపరిచిన విషయాలను పరిశీలించారు. తప్పులను సవరించారు. అధికారులు, సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డీఎంవో విలేకరులతో మాట్లాడుతూ.. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2021-22 నుంచి 1-10 ప్రొఫార్మాస్ ఆన్‌లైన్ చేస్తున్నామని చెప్పారు. 2024-25 వరకు మార్కెటింగ్‌కు సంబంధించిన ప్రతీది ఆన్‌లైన్‌లోనే ఉంటుందని తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఉన్న మార్కెట్లలో ఆన్‌లైన్ చేశామని చెప్పారు. మార్కెట్ ఆస్తులు, అప్పులు, రుణాలు, రైతుల వివరాలు, కొనుగోళ్లు, క్రయ, విక్రయాలు, చెల్లింపులు, శాఖ ఆస్తులు, ఆదాయం, వ్యయం, రైతు బంధు, మార్కెట్ పరిధిలోని గ్రామాలు, రైతుల వివరాలు, పంటల వివరాల నమోదు, అధికారులు, సిబ్బంది, తదితర విషయాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయించామని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేసిన మార్కెట్లలో డాటాను పరిశీలిస్తున్నామని చెప్పారు. డాటాలో తప్పులు లేకుండా సవరణలు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మార్కెటింగ్‌శాఖలో ప్రతి అంశం ఆన్‌లైన్‌లోనే సాగుతుందని, కాగిత రహిత వ్యవస్థను తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఇక్కడ కార్యదర్శి జీ రెడ్డినాయక్, అధికారులు యాకయ్య, లక్ష్మణ్, సిబ్బంది ప్రవీణ్, బాబా, తదితరులున్నారు.

సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి

స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 19: స్వాతంత్ర్య సమర యోధులను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణచౌక్‌లో షహీద్ అష్ఫాకుల్లాఖాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పండిట్ రాంప్రసాద్‌బిస్మిల్, అష్ఫాకుల్లాఖాన్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మేయర్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భానిస సంకెళ్ల నుంచి దేశ విముక్తి కోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగం చేశారని కొనియాడారు.

శివ పార్వతుల కళ్యాణోత్సవంలో పాల్గొన్న అల్పోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి దంపతులు

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

కార్పొరేషన్, డిసెంబర్ 19: దేశ్‌రాజ్‌పల్లిలోని అల్పోర్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహా రుద్రసహిత సహస్ర చండీ మహాయాగంలో భాగంగా మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రపారాయణం, తొమ్మిది మంద సువాసినీ కన్యకా పూజ, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. సాయంత్రం నగర వీధుల్లో పల్లకీ సేవ నిర్వహించారు. అల్పోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలకు అయోధ్య రాముడి అక్షింతలు

జమ్మికుంట: రాములోరి అక్షింతలకు పూజలు చేస్తున్న భక్తులు

జమ్మికుంట, డిసెంబర్19: రామనామ స్మరణతో జమ్మికుంట మార్మోగింది. అయోధ్యలో వచ్చే ఏడాది జనవరి 22న రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి అయోధ్య నుంచి జమ్మికుంటలోని గీతామందిర్ ఆలయానికి స్వామివారి అక్షింతలు, కలశం వచ్చింది. ఆలయ కమిటీ చైర్మన్ పురం వైకుంఠం ఆధ్వర్యంలో సభ్యులు, అర్చకుడు సంతోషాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రాత్రి అర్చకులు, ఆలయాల కమిటీ సభ్యులు గీతామందిర్‌కు చేరుకున్నారు. సంతోషాచార్యులు, వెంకటాచార్యులు, డింగరి రవికుమార్, తదితర వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో అక్షింతలు, 108కలశాలతో భక్తులు పట్టణ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు మంగళ హారతులు పట్టారు. శ్రీరాముడి భజనలతో ముందుకు సాగారు. రామాలయంలో ప్రత్యేక పూజల తర్వాత పట్టణం, మండలంలోని ఆలయాలకు స్వామివారి అక్షింతలను పంపించారు.

నుస్తులాపూర్‌లో ..

తిమ్మాపూర్, రూరల్, డిసెంబర్19: అయోధ్యలోని రామ మందిర అక్షింతలు స్వయం సేవక్ సభ్యుల ద్వారా కరీంనగర్ నుంచి ఆవుల కుమార్ నేతృత్వంలో మంగళవారం నుస్తులాపూర్ గ్రామానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా శివాలయంలో అర్చకుడు ఊరుమడ్ల కిరణ్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జనార్దన్

అర్షం జనార్దన్

చిగురుమామిడి, డిసెంబర్ 19: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు అర్షం జనార్దన్ నియామకమయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతానన్నారు.

కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతి

సైదాపూర్, డిసెంబటర్ 19: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న మోహన్, సంపత్‌కు హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి లభించింది. రాజన్నసిరిసిల్ల జోన్‌లో మొత్తం పదిమంది హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందగా, ఇందులో మోహన్, సంపత్ ఉన్నట్లు ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు.

నేడు దవాఖానలో విచారణ

విద్యానగర్, డిసెంబర్ 19: ప్రభుత్వ దవాఖానలో సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్ కొన్ని నెలల నుంచి ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని వీటితో పాటు అనేక సమస్యలపై విచారణ చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్, దవాఖాన అభివృద్ధి కమిటీ చైరపర్సన్ కనుమల్ల విజయ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు. దవాఖానలో కొందరు వైద్యులు ఇష్టానుసారంగా పని చేస్తున్నారని సరైన సమయపాలన పాటించడం లేదని వైద్యులపై చాలా ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. డీఎవో డాక్టర్ సాజిదా, వైద్య బృందం బుధవారం విచారించనున్నారు.

వృద్ధుడి అదృశ్యం

శంకరపట్నం, డిసెంబర్ 19: కేశవపట్నానికి చెందిన బండారి భూమయ్య (75) అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూమయ్య రెండు నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 15న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కూతురు బాడిష సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ నేత కుమారుడి మొదటి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

చిన్నారికి ఆశీర్వాదం..బాధితులకు పరామర్శ

- హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పర్యటన

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 19: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి రోడ్డులో నివసించే బీఆర్ఎస్ నేత బొంగోని సంతోష్‌కుమార్ కొడుకు రుద్రాన్స్ మొదటి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం 17వ వార్డులో మృతి చెందిన ముస్లిం నాయకుడి కుటుంబ సభ్యులు, 21వ వార్డులోని వరంగల్‌రోడ్‌లో ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గుర్రం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వెంట ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ భూసారపు బాపూరావు, సీనియర్ నాయకులు గందె శ్రీనివాస్, బీఎస్ ఇమ్రాన్, కొండ్ర నరేశ్, ముక్క రమేశ్, మొలుగు పూర్ణచందర్, పంజాల కుమారస్వామి, భాషబోయిన కుమార్‌యాదవ్, సాగర్‌రెడ్డి, అమ్జదుల్లా ఖాన్, తులసి లక్ష్మణమూర్తి ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై బీఎల్ వోలకు అవగాహన

వీణవంక, డిసెంబర్ 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పార్లమెంట్ ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా బూత్ స్థాయి అధికారులకు తహసీల్దార్ తిరుమల్ రావు ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఫారం-6, ఫారం -7, ఫారం -8 పై అవగాహన కల్పించారు. ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ భాస్కర్, కరుణాకర్, ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో..

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 19: కొత్త ఓటర్ల నమోదుకు మానకొండూర్ రైతు వేదికలో మంగళవారం ఎలక్షన్ డీటీ రాకేశ్ ఆధ్వర్యంలో ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్వోలకు ట్రైనర్లు రాజనీష్, కొండల్ రెడ్డి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, పీఈటీలు

మానకొండూర్, డిసెంబర్ 19: మండలంలోని దేవంపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. అండర్ -19 విభాగంలో 16 మంది బాలురు, 16 మంది బాలికలు, అండర్ -17 విభాగంలో 16 మంది బాలురు, 16 మంది బాలికలు పాల్గొననున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, పీఈటీ శ్రీనివాస్, వేణుగోపాల్, వివిధ పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్మార్ట్' పనులపై విజిలెన్స్ తనిఖీలు

కార్పొరేషన్, డిసెంబర్ 19: కరీంనగర్ బల్దియా పరిధిలో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనులపై విజిలెన్స్ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లలో కోర్ కటింగ్, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కాగా, మరో రెండు రోజులు నగరంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టనున్నారు.

దవాఖాన నిర్మాణానికి స్థల పరిశీలన

గన్నేరువరం, డిసెంబర్ 19: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ దవాఖాన కోసం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, బొడ్డు సునీల్, అలవాల కోటి, అనంతరెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, సాంబయ్య పల్లె సర్పంచ్ నరసింహారెడ్డి, చొక్కరావుపల్లి సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, మైలారం సర్పంచ్ దుడ్డు రేణుకామల్లేశం, మాజీ సర్పంచ్ రాజయ్య, చింతల శ్రీధర్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, మల్లేశం, పరశురాములు, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

చిగురుమామిడి, డిసెంబర్ 19: మండలంలోని పలు గ్రామాల్లో ఈజీఎస్ నర్సరీల్లో చేపడుతున్న పనులను టీఏలు దుడ్డెల అంజలి, వెంకటేశ్ మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో ప్రస్తుతం కూలీలు పాలిథిన్ కవర్లలో కంపోస్టుతో కలిపిన ఎర్ర, నల్లమట్టి నింపుతున్నారని టీఏలు పేర్కొన్నారు.

ఇండస్ట్రీ టూర్‌కు వాగేశ్వరి విద్యార్థులు

తిమ్మాపూర్, డిసెంబర్ 19: మండలంలోని వాగేశ్వరి కళాశాల ఎంబీఏ సెకండియర్ విద్యార్థులు పెద్దపల్లి జిల్లాలోని కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీని సందర్శించారు. సిమెంట్ ఉత్పత్తి విధానం, నిర్వహణ గురించి సంస్థ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ప్రొడక్షన్ మేనేజర్ సదానందం, సేఫ్టీ మేనేజర్ సాయికిరణ్ నిర్వహణ, ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. టూర్‌కు వెళ్లిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ డాక్టర్ గండ్ర శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ అభినందించారు. టూర్ కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ హరిప్రసాద్, అధ్యాపకులు శ్రీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, అర్చన, అస్మాబేగం పాల్గొన్నారు.

డీఐజీ రమేశ్‌నాయుడు బదిలీ

రాంనగర్ డిసెంబర్ 19 : రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్ బదిలీల్లో రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ రమేశ్ నాయుడికి స్థాన చలనం కలిగింది. జోన్ డీఐజీ రమేశ్ నాయుడు రాష్ట్ర సీఐడీ విభాగానికి బదిలీపై వెళ్లనున్నారు. అయితే ఆయన స్థానంలో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

ఎంపీ ఎన్నికలకు సెక్టోరియల్ ఆఫీసర్ల నియామకం

కార్పొరేషన్, డిసెంబర్ 19: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సెక్టోరియల్ అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి 33 మంది, చొప్పదండికి 32 మంది, మానకొండూర్‌కు 29 మంది, హుజూరాబాద్‌కు 30 మందిని నియమించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 19: మండలంలోని పలు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండర్ గంగిశెట్టి జగదీశ్వర్ 352 పరీక్ష ప్యాడ్లను మంగళవారం వితరణ చేశారు. మోడల్ స్కూల్‌లో 100, కేజీబీవీలో 17, ఎంజేపీలో 75, సీవోఈలో 160 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లను అందజేశారు. తల్లి పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌ను ఎంజేపీ ఆర్సీవో గౌతమ్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరడపల్లి పాఠశాలలో భోజన ప్లేట్ల వితరణ

శంకరపట్నం, డిసెంబర్ 19: మండలంలోని ఎరడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో దాతలు విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లను వితరణ చేశారు. తాడికల్ గ్రామానికి చెందిన ఎండీ అష్రఫ్ పుట్టిన రోజును పురస్కరించుకుని తాడికల్ యూత్ క్లబ్ సభ్యులు 6-10వ తరగతికి చెందిన 50 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లను అందజేశారు. అష్రఫ్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం భూంరెడ్డి, యూత్ క్లబ్ సభ్యులు శ్రావణ్, చింటు, జిత్, హన్మాండ్ల సాయిచరణ్, దుస్స సాగర్, ముత్తోజు శ్రీనివాస్, ఎండీ రియాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆరట్టు ఉత్సవం

గంగాధర, డిసెంబర్ 19: మండలంలోని మధురానగర్ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆరట్టు ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ చేశారు. ఉత్సవ మూర్తిని అయ్యప్ప భక్తులు కీర్తనలు, నృత్యాల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరాం మధుకర్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ఘన సన్మానం

మహాపాదయాత్ర స్వాములను సత్కరిస్తున్న ఆలయ పూజరులు

కార్పొరేషన్, డిసెంబర్ 19: కరీంనగర్ నుంచి గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకొని తిరిగివచ్చిన 150 మంది దీక్షాపరులకు నగరంలోని స్వాములు మంగళవారం ఘన స్వాగతం పలికారు. గోదాంగడ్డలోని అయ్యప్ప దేవాలయ ప్రధాన అర్చకుడు మంగళంపల్లి రాజేశ్వరశర్మ, డింగిరి చాణక్య వీరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాదయాత్ర స్వాములు మాట్లాడుతూ, అయ్యప్ప ఆశీస్సులతో ఎలాంటి ఆటంకం లేకుండా పాదయాత్రను పూర్తి చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో బొల్లు నరేందర్, లింగంపల్లి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ముఖేష్, శేఖర్, ఆంజనేయులు, మనోహర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

భరత్‌కుమార్‌ను అభినందిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ గడ్డాల శ్రీనివాస్ తదితరులు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 19: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల/కళాశాల (వీణవంక) ఏడో తరగతి విద్యార్థి కొండపాక రిత్విక్ అండర్ 14 విభాగంలో జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 15, 16, 17వ తేదీల్లో కామారెడ్డిలోని మహాత్మాగాంధీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీల్లో కొండపాక రిత్విక్ ప్రతిభ చూపి, జాతీయ స్థాయికి అర్హత సాధించాడని చెప్పారు. ఈ నెల 25న మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రిత్విక్ పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థితోపాటు అతడికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఇమ్మడి భరత్‌కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వింధ్యావాలి విద్యార్థిని

విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

కొ